

ఎడ్యుకేషన్ హబ్‌గా మెదక్
● మెడికల్ కాలేజీతో మెరుగైన వైద్య సేవలు
● స్థానికులకు డాక్టరు కోర్సు చదివే అవకాశం
● కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు
● వైద్య కళాశాల భవనం సందర్శన
● అనుమతులు రావడంపై సంబరాలు 7



సొసైటీల్లో తప్పుడు ఎంట్రీలు..
రుణమాఫీలో కొర్రీలు

● పీఏసీఎస్ సిబ్బంది నిర్లక్ష్యం.. రైతులకు శాపం
● వందల మంది రుణమాఫీకి దూరమయ్యే దుస్థితి
● మెదక్ జిల్లాలో కుటుంబాల నిర్ధారణ సగమే..
● రేషన్‌కార్డు లేని లబ్ధిదారులు 10 వేల మంది
● ఇప్పటి వరకు 5వేల మంది వివరాల సేకరణ

మెదక్, సెప్టెంబరు 11: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది చేతివాటం రైతులకు శాపంగా మారింది. వారి నిర్లక్ష్యంతో రైతులు రుణమాఫీకి దూరమయ్యే దుస్థితి నెలకొన్నది. సొసైటీల సభ్యులు గతంలో రుణాలు పొందినప్పటికీ, సిబ్బంది లెడ్జర్‌లో తేదీలు తప్పుగా నమోదు చేయడంతో రైతులకు రుణమాఫీ కావడం లేదు. మెదక్ జిల్లావ్యాప్తంగా మొత్తం 1.86 లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా బ్యాంకుల నుంచి సుమారు 70 వేల పైచిలుకు మంది రైతులు రుణ సాయం పొందుతున్నారు. వీరిలో చాలామంది రైతులు తీసుకున్న అప్పుకు వడ్డీ కట్టి రికార్డుల్లో రెన్యూవల్ చేసుకుంటారు. సొసైటీల్లోనూ రైతులు తమ రుణాలను ఇలాగే రెన్యూవల్ చేసుకుంటారు. అలా రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సొసైటీల సిబ్బంది రికార్డుల్లో నమోదు చేస్తుంటారు. చాలాచోట్ల సొసైటీ సిబ్బంది రికార్డుల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వందలాది మంది రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. ఈ పరిస్థితి జిల్లాలోని పలు సొసైటీల్లో ఉన్నట్టు తెలుస్తున్నది. కొన్ని సొసైటీలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

● చేగుంట మండలం రెడ్డిపల్లి సొసైటీలో 16 మంది రైతులు 2022 నవంబరు లో రుణసాయం పొందారు. కానీ సొసైటీ లెడ్జర్‌లో 2024 జనవరిలో రుణం పొందినట్లు రాసుకున్నారు. దీంతో ఆ రైతులకు రుణమాఫీ కాలేదని, ఇది సొసైటీ సిబ్బంది తప్పిదమే నని జిల్లా కో-ఆపరేటీవ్ అధికారి కరుణ తెలిపారు. ఈ ఘటనలో సొసైటీ కంప్యూటర్ ఆపరేటర్,సీఈవోలపై వేటు పడింది.

● చిన్నశంకరంపేట మడూర్ రైతులు సొసైటీ నుంచి 2023 అక్టోబరులో పంట రుణాలు తీసుకున్నారు. కానీ సొసైటీ రికార్డుల్లో ఫిబ్రవరి 2024లో అప్పు తీసుకున్నట్లు ఎంట్రీ చేశారు. ఈ విషయమై డీసీసీబీ బ్యాంకు సీఈవోకు లేఖ రాసినట్లు డీసీవో తెలిపారు.

● తూప్రాన్‌లో 617 మంది రైతులకు సంబంధించి ఒకే ఆధార్ నంబర్ నుఎంట్రీ చేయడంతో సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. ఆ తర్వాత డీసీవో సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టినప్పటికీ ఇప్పటికీ 120 రైతులకు రుణమాఫీ కాలేదు.

● రామాయంపేట మండలం కోనాపూర్ సొసైటీలో 312 మంది రైతులకు ఆధార్ కార్డు మ్యాచ్ కావడం లేకపోవడంతో రుణం మాఫీ కాలేదు. వెంటనే అధికారులు విచారణ జరిపి తప్పులు సరిదిద్దుతున్నట్లు ప్రకటించారు. కానీ ప్రస్తుతం కేవలం 46 మంది రైతులకే రుణమాఫీ డబ్బులు అందాయి. మిగతా వారికీ త్వరలోనే మాఫీ జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

నింపాదిగా నిర్ధారణ ప్రక్రియ

రుణమాఫీ కాని రైతుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సభ్యుల నిర్ధారణ జిల్లాలో నింపాదిగా సాగుతోంది. రుణమాఫీ కాని వారి నుంచి ఇప్పటికీ వ్యవసాయ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో రేషన్‌కార్డు లేని కుటుంబాలు 10వేలు ఉంటే.. ఇప్పటి వరకు 5వేల కుటుంబాల వివరాలు మాత్రమే సేకరించినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో రేషన్‌కార్డు లేని కుటుంబాల వివరాలను అధికారులు ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఆయా రైతుల వివరాలను నిర్ధారణ చేసుకున్న తరువాత రుణమాఫీ చేస్తారని తెలుస్తున్నది. మరోవైపు, పంట రుణం పొందే సమయంలో పట్టా భూములు ఉండి.. తదనంతరం విక్రయించడంతో పలువురు రైతుల వద్ద ప్రస్తుతం పట్టా పాస్‌బుక్‌లు లేవు. రుణమాఫీ కోసం పట్టాపాస్‌బుక్ అడుగుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే, ఆధార్‌కార్డులో తప్పులు, బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు లేకపోవడం, డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ ఫెయిల్ తదితర సమస్యలతో పలువురు రైతులకు రుణమాఫీ జరగలేదు. ఈ సమస్యలను బ్యాంకువారే పరిష్కరిస్తారని వ్యవసాయ అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొలాల్లో పీసీబీ ఈఈ పరిశీలన

● కలెక్టర్ ఆదేశాలతో మురుగునీటి శాంపిల్స్ సేకరణ
● సంగారెడ్డి మున్సిపాలిటీకి నోటీసులు
● ఫసల్‌వాది డంప్ యార్డు నిర్వహణపై నివేదిక

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, సెప్టెంబరు 11 : పచ్చని పంటలను మురుగునీరు ముంచెత్తుతున్న తీరును ఎండగడుతూ బుధవారం "కాలుష్యం కంపు పొలాల్లో డంపు" అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ క్రాంతి వల్లూరు స్పందించారు. ఈ విషయంపై సమగ్రమైన విచారణ చేపట్టాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ గీతను ఆదేశించారు. ఈ మేరకు ఆమె తన సిబ్బందితో సంగారెడ్డి పట్టణ శివారులోని ఫసల్ వాది గ్రామ పొలాలను పరిశీలించారు. సంగారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తా చెదారాన్ని నిల్వ చేస్తున్న డంపు యార్డును సైతం తనిఖీ చేశారు. డంపు యార్డు నిర్వహణ సరిగ్గా లేకనే మురుగునీరు లీకయ్యి పొలాల్లో కలుస్తుందని నిర్ధారణకు వచ్చారు. డంపు యార్డు, పెద్ద కాలువ, పొలాల్లో నిల్వ ఉన్న మురుగునీటితో పాటు, గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో నీటిని శాంపిల్స్‌గా సేకరించారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు పీసీబీ జోనల్ కార్యాలయానికి సమర్పిస్తామని గీత తెలిపారు. కాగా పరిశీలనకు వెళ్లిన అధికారులకు స్థానిక రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దాదాపు 150 ఎకరాల్లో పంటలు నష్టపోతున్నామని, తమకు శాశ్వత పరిష్కారం చూపించాలని మొర పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా డంపు యార్డును సక్రమంగా నిర్వహించక పోవడంపై సంగారెడ్డి మున్సిపాలిటీకి కూడా నోటీసులు ఇవ్వనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.



ఫసల్‌వాది పెద్ద చెరువు నీటి శాంపిల్స్ సేకరిస్తున్న జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ గీత



చెరువును తలపిస్తున్న రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్ (ఫైల్)

నిర్మాణాల కోసం రోడ్లను ముంచేస్తున్నారు..

ఇష్టారీతిన వరద కాలువల మళ్లింపు

తెల్లాపూర్‌లో రియల్టర్ల మాయాజాలం

రామచంద్రాపురం, సెప్టెంబరు 11: సంగారెడ్డి జిల్లా పరిధిఓని తెల్లాపూర్‌లో చెరువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వరద కాలువలు ఎక్కడికక్కడ కబ్జాలకు గురవడంతో కాలనీలు, రోడ్లు జలమయమవుతున్నాయి. ఈ పరిస్థితిపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కాలువ కనుమరుగు.. రోడ్డుపై వరద పరుగు' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో, పర్యావరణ ప్రేమికులు 'ఆంధ్రజ్యోతి'కి మరిన్ని కబ్జాల వివరాలను అందించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వనం చెరువులోకి రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం గోపన్‌పల్లి పెద్ద చెరువు నుంచి అలుగు నీరు, డ్రైనేజీతో కలిసిన మురుగు వచ్చి చేరుతున్నది. గతంలో గోపన్‌పల్లి పెద్ద చెరువు అలుగునీరు సిరిమయకుంట, కుమ్మరి కుంటలు నిండిన తరువాత వనం చెరువులోకి చేరేవి. ప్రస్తుతం రేడియల్ రోడ్డు-30 వద్ద ఓ బడా బిల్డర్ సిరిమయ కుంటను తన స్థలంలో కలుపుకుని వరద నీటిని మళ్లించి నిర్మాణాలను పూర్తి చేశాడు. సదరు బిల్డర్ రేడియల్ రోడ్డు-7 ఎక్స్‌టెన్షన్‌లో తన నిర్మాణానికి అడ్డుగా వస్తున్న ఎల్కగండి వరద కాలువను పూర్తిగా పూడ్చివేశాడు. మరో కాలువను దారి మళ్లించాడు. గ్రామంలోని నాలుగు చెరువుల నుంచి వరద నీటిని ఇక్రిశాట్ చెరువుకు తీసుకువెళ్లే గాడుదల బాట వరద కాలువను దారి మళ్లించారు. 40 ఫీట్ల వెడల్పు ఉన్న కాలువను మళ్లించడంతో వరద నీరు రేడియల్ రోడ్డు-7 ఎక్స్‌టెన్షన్‌ను ముంచెత్తుతున్నది. గాడుదల బాట నుంచి నీరు ఇక్రిశాట్ చెరువులోకి వెళ్లకపోతే రైతుల పొలాలు మునుగుతాయని గ్రామస్థులు నర్సింహులు, సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వరద వస్తే రైల్వేలైన్‌కు కూడా ప్రమాదమని హెచ్చరించారు.

ఆర్‌అండ్‌బీ శాఖ తప్పిదమే కారణం

రేడియల్ రోడ్డు ఎక్స్‌టెన్-7 నిర్మాణ సమయంలో నీటిపారుదల శాఖను సంప్రదించలేదు. కేవలం రెండు మీటర్ల కల్వర్టును మాత్రమే నిర్మించారు. దీంతో, ఇటీవల కురిసిన వర్షాలకు రేడియల్ రోడ్డు-7 ఎక్స్‌టెన్షన్‌పై నీరు నిలిచి చెరువును తలపించింది. కల్వర్టు కొంత భాగం తొలగించి నీరు ముందుకు పారేందుకు ఏర్పాట్లు చేశాం.

-సంతోషిణి, ఇరిగేషన్ ఏఈ

మంచం పట్టిన ఫత్తేపూర్

కల్హేర్, సెప్టెంబరు 11: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలోని ఫత్తేపూర్‌లో వైరల్ ఫీవర్స్ విజృంభిస్తున్నాయి. దీంతో, బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వర బాధితులకు చికిత్స అందజేశారు. గ్రామంలో 100 మంది వరకు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఇటీవల ఓ యువకుడు జ్వరంతో మృతి చెందడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. 75 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి ప్రతిభ, ఎంపీహెచ్‌వో చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ రామ్‌చందర్, ఏఎన్ఎం స్వరూప, ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



ఫత్తేపూర్‌లో జ్వర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

చెరువులు, కుంటల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 11 : జిల్లాలో చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం నీటిపారుదల, రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. హెచ్ఎండీఏ పరిధిలోకి వచ్చే మండలాల్లోని చెరువులు, కుంటల వివరాలు సేకరించి, మ్యాపింగ్‌ను హెచ్ఎండీఏ వైబ్‌సైట్‌లో ఉంచాలని ఆదేశించారు. చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ల పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలను గుర్తించి తొలగించాలని నిర్దేశించారు.

● కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బీఎల్‌వోల ఇంటింటి సర్వేకు సహకరించి ఓటరుజాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈ ఏసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 11: గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పోలీసుల అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, బొల్లారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో వినాయక నిమజ్జనం చేయనున్న పలు చెరువులు, కుంటలను బుధవారం ఆయన పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడానికి క్రేన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు కట్టలపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు ప్రవీణ్‌రెడ్డి, సదా నాగరాజు తదితరులు ఉన్నారు.

కేజీబీవీల్లో అధ్యాపకుల భర్తీ..

● నేడు డీఈవో వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11 : సంగారెడ్డి జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అధ్యాపకులు భర్తీకి చర్యలు చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీల పోస్టులను మెరిట్ ప్రకారం భర్తీ చేపట్టనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించి 1:3 మెరిట్ జాబితాను నేడు సంగారెడ్డి డీఈవో కార్యాలయంలో వెల్లడించి, రేపు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 18 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు తగిన ఆధారాలతో కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలన్నారు. 19న కౌన్సెలింగ్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వనున్నామని, ఎంపికైన వారి జాబితాలను వెబ్‌సైట్‌తో పాటు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందుబాటులో ఉంచనున్నట్లు డీఈవో వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

పేరుకే ప్రజా పాలన.. పోలీసుల రాజ్యం నడుస్తుంది

ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెప్తారు : మాజీ మంత్రి హరీశ్‌రావు

గుమ్మడిదల, సెప్టెంబరు 11 : కాంగ్రెస్ పాలనలో పోలీసుల రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన ఘటనలో గాయపడిన గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌రెడ్డి బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితులకు సహాయం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం అమానుషమని అన్నారు. దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను వదిలేసి.. గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు కేసులు పెట్టడం ఎంతవరకు సమాజసమని ప్రశ్నించారు. పేరుకే ప్రజా పాలన.. నడుస్తున్నదంతా పోలీస్ రాజ్యమేనని విమర్శించారు. ప్రభుత్వమే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. అధికారం ఉందని అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఆయన వెంట నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, కొలన్ బాల్‌రెడ్డి, ఆదర్శరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సోమిరెడ్డి, వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దున్నేవారికే వక్ఫ్ భూములు

● రాష్ట్రంలో వక్ఫ్ రికార్డుల్లో 85వేల ఎకరాలు
● ఇందులో 77వేల ఎకరాలు వ్యవసాయ భూములే
● వక్ఫ్ చట్టం జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలు డీకే అరుణ



వక్ఫ్ భూ బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీకే అరుణ

జహీరాబాద్, సెప్టెంబరు 11: రికార్డుల్లో వక్ఫ్ భూములుగా నమోదైనా.. రైతులు సాగు చేసుకుంటున్న భూములు వారికే దక్కేలా చూస్తామని జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో వక్ఫ్ భూ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెంగాణవ్యాప్తంగా 85వేల ఎకరాల భూమి రికార్డుల్లో వక్ఫ్ ఆస్తిగా నమోదైందని, ఇందులో 77వేల ఎకరాలు వ్యసాయ భూమి ఉందని వివరించారు. జహీరాబాద్ ప్రాంతంలో 13వేల ఎకరాలు వక్ఫ్ పరిధిలోకి వెళ్లాయని తెలిపారు. రైతులకు, బాధితులకు న్యాయం చేసేందుకే కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ చట్టానికి మార్పులు చేయాలని సంకల్పించిందని చెప్పారు. జేపీసీ సభ్యులు దేశవ్యాప్తంగా పర్యటిస్తూ అభిప్రాయాలు సేకరిస్తారని వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న జేపీసీ కమిటీ సమావేశంలోనూ రైతుల అభిప్రాయాలను వింటామని చెప్పారు. అందరి అభిప్రాయాల మేరకు బిల్లుకు అవసరమైన సవరణలు చేస్తామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి, సీఐటీయూ నాయకుడు రాంచందర్, రైతు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ జిల్లాఅధ్యక్షురాలు గోధావరి అంజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ 2018 అనంతరం పెద్దమొత్తంలో భూములు వక్ఫ్ ఆధీనంలోలోకి వెళ్లడం విచారకరమన్నారు. అనంతరం నియోజకవర్గంలోని భూ బాధితులు మహబూబ్‌నగర్ ఎంపీ, జేపీసీ కమిటీ సభ్యురాలు అరుణకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పట్టణంలో వక్ఫ్ భూ బాధిత రైతులు భారీ ర్యాలీ, ఆందోళన నిర్వహించారు.

సర్కారు బడుల్లో కరాటే!

6-10 తరగతుల బాలికలకు మూడు నెలల పాటు శిక్షణ

సంగారెడ్డి జిల్లాలో 250 పాఠశాలలు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11: బాలికలకు విద్యతో పాటు ఆత్మరక్షణ విద్య కూడా ఎంతో అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఆకతాయిల ఆగడాల నుంచి తమని తాము రక్షించుకోవడం, ఆత్మవిశ్వాసం, శారీరక ధృఢత్వం, మానసికోల్లాసం కోసం కరాటే నేర్పించాలని నిర్ణయించింది. సర్కారు బడుల్లో 'రాణి లక్ష్మీబాయి రక్షా ప్రశిక్షణ్' పేరిట కరాటే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లాలోని 29 ప్రాథమిక, 221 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసింది. 6 నుంచి 10వ తరగతి చదివే బాలికలకు వారానికి మూడు తరగతుల చొప్పున మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకోసం ఈ నెల 16వ తేదీ వరకు గడువు విధిస్తూ విద్యాశాఖ ప్రకటన జారీ చేసింది. కరాటే శిక్షణ ఇచ్చేందుకుగాను ప్రతీ పాఠశాలకు నెలకు రూ.5 వేల చొప్పున మూడు నెలలకుగాను ఒక్కో పాఠశాలకు రూ.15 వేలు నిధులు కేటాయించారు.



కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు (ఫైల్)

ఆత్మవిశ్వాసం పెంచేందుకు దోహదం : ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు, వారిని మరింత బలవంతులుగా తీర్చిదిద్దేందుకు కరాటే శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ నుంచి ఆదేశాలు అందాయి. మూడు నెలల పాటు కరాటే శిక్షణ తరగుతులు నిర్వహించనున్నాం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా శిక్షకుల నియామకానికి చర్యలు తీసుకున్నాం.



రైల్వే గేటు మూసివేస్తే ఊరుకోం

● రైల్వే అధికారులను హెచ్చరించిన నాగిరెడ్డిపల్లి రైతులు



రైల్వే గేటు మూసేయొద్దని అధికారులను కోరుతున్న నాగిరెడ్డిపల్లి గ్రామ రైతులు, ప్రజలు

కోహీర్, సెప్టెంబరు 11: నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులోని 20 నంబరు రైల్వేగేట్‌ను మూసేస్తే ఊరుకునేది లేదని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు, ప్రజలు రైల్వే అధికారులను హెచ్చరించారు. గ్రామ శివారులోని 20 నంబరు రైల్వే గేటును మూసివేసి అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని రైల్వే అధికారులు ఇటీవల రెవెన్యూ అధికారులకు తెలిపారు. అయితే ఆ గ్రామ రైతుల, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని రెవెన్యూ అధికారులు రైల్వే అధికారులకు సూచించారు. వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు బుధవారం రైల్వే గేటు వద్దకు వెళ్లారు. రైల్వేగేటును మూసివేయడం సరికాదని ప్రజలు, రైతులు అన్నారు. నాగిరెడ్డిపల్లికి చెందిన చాలామంది రైతుల భూములు రైల్వేగేటుకు అవతలి వైపు ఉండడమే కాకుండా బిలాల్‌పూర్, పైడిగుమ్మల్ మర్పల్లి, భూచన్‌పల్లితో పాటు రెండు తండాలకు వెళ్లేందుకు అనుకూలమైన మార్గం మధ్యన అండర్ బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మిస్తే వర్షాకాలంలో నీళ్లు నిండి రాకపోకలు ఆగిపోతాయన్నారు. చాలామంది రైతులు ఇక్కడ భూముల్లో చెరకు, అల్లం, ఆలుగడ్డ తదితర పంటలు పండిస్తారు. వాటిని ఎగుమతి చేయాలంటే అనుకూలమైన మార్గం ఉండాలి తప్ప చిన్నపాటి అండర్ బ్రిడ్జి నిర్మిస్తే వాహనాల రాకపోకలు సాగవని చెప్పారు. రైతుల, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు అవసరమైతే రైల్వే వంతెన నిర్మించాలి తప్ప అండర్ బ్రిడ్జి నిర్మించొద్దన్నారు. ఒకవేళ అండర్ బ్రిడ్జి నిర్మించాలని నిశ్చయించుకుంటే ఊరుకోమని, ఈ విషయమై సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

గీతం స్కాలర్ కొప్పుల సురేష్‌కు డాక్టరేట్



కొప్పుల సురేష్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 11: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని రసాయనశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి కొప్పుల సురేష్ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్.సురేంద్ర బాబు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 'యురేనియం, స్ట్రాంటియం, సీసీయంల తొలగింపు కోసం ఊట(స్థిరమైన లోహ, సేంద్రియ (ఫ్రేమ్ వర్క్), వాటి మిశ్రమాల సంశ్లేషణ, లక్షణం' అనే అంశంపై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. సురేష్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియాబేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్


● శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

శివ్వంపేట, సెప్టెంబరు 11: వినాయక మండపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్న ఘటన బుధవారం మెదక్ జిల్లా మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఓ వినాయక మండపంలో ఐదుగురు పేకాట ఆడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పేకాట స్థావరంపై దాడిచేసి రూ.41,500 నగదు, 52 కార్డ్స్‌ను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.















మిషన్ భగీరథ కార్మికులకు

పెండింగ్ వేతనాలివ్వాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

కంది, సెప్టెంబరు 11 : మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మిషన్ భగీరథ.. కార్మికుల వ్యథ' అనే కథనానికి పలు ప్రజా సంఘాల నాయకులు స్పందించారు. ఈ మేరకు బుధవారం మండలపరిధిలోని కాశీపూర్‌లోని నీటి ట్యాంకు వద్ద మిషన్ భగీరథ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ పది నెలలుగా జీతాలు రాక మిషన్ భగీరథ కార్మికులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్మికులు నర్సింహులు, శ్రీకాంత్, లక్ష్మణ్, యాదయ్య, సాయికుమార్, లింగం, సదానందనం, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 11: పిల్లర్ గుంతలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అభిమాన్‌సింగ్ కథనం ప్రకారం ఇస్నాపూర్‌లోని ఓడీఎఫ్ కాలనీ పక్కన ఓ సంస్థ నిర్మిస్తున్న భవనం పిల్లర్ గుంతల వద్ద కూలీలు ఉదయం పని చేసేందుకు వెళ్లగా నీటిలో యువకుడి మృతదేహం కనిపించింది. సైట్ ఇన్‌చార్జి జయంత్‌రెడ్డి అందించిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు నీలిరంగు జీన్స్ ప్యాంటు, నలుపురంగు ఫుల్ టీషర్ట్, నలుపు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై హిందీ అక్షరాలలో మా (షా) అని పచ్చబొట్టు ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూలైలో అదృశ్యమై.. బావిలో శవమై..

● కుళ్లిపోయిన స్థితిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం
● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


నర్సమ్మ (ఫైల్)

మద్దూరు, సెప్టెంబరు 11 : మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు గొట్టపు నర్సమ్మ (80) అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గొట్టపు నర్సమ్మ గత జూలై 24న ఉదయం 6గంటలకు ఇంట్లో నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పొలం వద్దకు వెళ్లిన రైతు కోతులను కొట్టే క్రమంలో బావిలోకి తొంగి చూడగా కుళ్లిన శవం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గొట్టపు నర్సమ్మ మృతదేహంగా గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి కుటుంబానికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్

వర్గల్, సెప్టెంబరు 11 : వర్గల్ మండల కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుపబడుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకుడు ఉమాపతిరెడ్డి హాజరవుతారని తెలిపారు. లోక్‌సభలో జరిగే కార్యకలాపాలను ప్రతిబింబించే విధంగా యూత్ పార్లమెంట్ పోటీ ఉంటుందని, ఇందులో 55 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

14న సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 11: సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 14న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామిగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 100, 800, 3000 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన ధృవపత్రం, పదవ తరగతి మెమో తీసుకొని ఈ నెల 13న సాయంత్రం 6 గంటల లోపు అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8501977079, 9666020322, 9704061543 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20న హైదరబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు

● పరారీలో మరో నలుగురు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 11 :గంజాయిని సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన బుధవారం సాయంత్రం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులో చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం కొంతమంది గంజాయిని తీసుకొని పొన్నాల నుంచి సిద్దిపేటకు వెళ్తున్నారన్న సమాచారంతో సిద్దిపేట అర్బన్ మండలం ఇందూర్ కళాశాల వద్ద ఎస్ఐ చంద్రయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తరుణంలో పోలీసులను చూసి బైకుపై పారిపోతున్న యువకులను పట్టుకొని తనఖీలు చేయగా గంజాయి లభించింది. ఈ ఘటనలో సిద్దిపేట అర్బన్ మండలం టీహెచ్ఆర్‌నగర్‌కు చెందిన నాచారం సాయికుమార్, పొన్నాల గ్రామానికి చెందిన కోటగళ్ల ఆదర్శ్, కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన తలారి రాకేశ్, కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన దయ్యాల శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు చేర్యాల మండలం ముత్యాల గ్రామానికి చెందిన దండు రాజేష్, నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గంగుల గణేష్, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రణయ్, కోహెడ మండలం జ్యోతిరావు తండాకు చెందిన భూక్య అనిల్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 50 గ్రాముల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మెదక్

● వైద్య కళాశాల ఏర్పాటుతో స్థానికులకు గొప్ప అవకాశం
● నెరవేరనున్న పేద విద్యార్థుల కల
● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
● పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
● కలెక్టర్ రాహుల్‌రాజ్


కేక్ కట్ చేసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు తినిపిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్/మెదక్ అర్బన్, సెప్టెంబరు 11: వైద్య కళాశాల ఏర్పాటుతో మెదక్ విద్యాహబ్‌గా మారుతోందని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లికొట్టాల్‌లోని తాత్కాలిక మెడికల్ కళాశాల భవనాన్ని ఆయన కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎంసీహెచ్ పక్కన నిర్మించనున్న శాశ్వత మెడికల్ కాలేజీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్నారు. వైద్యకళాశాల ఏర్పాటుతో స్థానికులకు డాక్టరు కోర్సు చదివే గొప్ప అవకాశం దక్కుతుందని, పేద విద్యార్థుల కల సాకారం అవుతుందన్నారు. నర్సింగ్, మెడికల్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లా అభివృద్ధికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భవన నిర్మాణలకు చర్యలు తీసుకుంటామన్నారు జిల్లాలోని యువత డాక్టర్లు ఇంజినీర్లుగా, ఐఏఎస్ అధికారులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. ఎన్నో అవాంతరాల తర్వాత వైద్య కళాశాల మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి..

కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వైద్యాధికారులు పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా పునర్విభజనలో భాగంగా మెదక్ ప్రత్యేక జిల్లా కేంద్రం అయినా అంత అభివృద్ధి చెందలేదన్నారు. జిల్లా అభివృద్ధిలో విద్యా, వైద్య సౌకర్యాలు మెరుగైన పాత్ర పోషిస్తాయన్నారు. అంతకముందు మెదక్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు రాందాస్ చౌరస్తాలో ముఖ్యమంత్రిరెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శివదయాల్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిన్న చెరువుకు గండి

● తూమును ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు
● వృథాగా నీరు.. ఖాళీ అవుతున్న చెరువు
● కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు

సదాశివపేట, సెప్టెంబరు 11: సదాశివపేట పట్టణంలోని 65వ జాతీయ రహదారి పక్కనే మిషన్‌కాకతీయ పథకంలో అభివృద్ధి చేసిన పిన్న చెరువుకు కొందరు గుర్తు తెలియన వ్యక్తులు రాత్రికి రాత్రే గండి కొట్టారు. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పోతుతున్నది. ఇది చూసిన రైతులు, మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిన్న చెరువు నిండు కుండలా మారడంతో వెనకాల వెలసిన వెంచర్లల్లోని ప్లాట్లు నీటిలో మునిగిపోయాయి. దీంతో కొందరు రియల్టర్లు చెరువును ఖాళీ చేయాలనే ఉద్దేశంతో ఈ దారుణానికి ఒడిగట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట కింది భాగంలో చెరువు తూమును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో చెరువులోని నీరు రైతుల భూములను ముంచెత్తుతున్నది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు ఉండడం వల్లే వర్షాలు కురిసిన ప్రతిసారి అవి నీటి మునుగుతున్నాయి. దీంతో చెరువు నిండినప్పుడల్లా కొందరు రియల్లర్లు చెరువుకు గండి కొట్టడం అలవాటుగా మార్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంత జరిగినా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు ఇటు వైపుగా కన్నెత్తి చూడడం లేదని రైతులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి..



పిన్న చెరువు పై భాగంలో ఉన్న వెంచర్ల యజమానులే చెరువు నిండగానే ఎక్సకవేటర్లతో చెరువు తూమును, కట్టను ధ్వంసం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. పట్టణంలో 100కు పైగా మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. పిన్న చెరువు, ఊబ చెరవు, కొత్త చెరువులపై ఆధారపడి బ్రతుకుతున్నాయి.
-హనుమంతు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు


సదాశివపేట పట్టణంలోని పిన్న చెరువు, గండి పడడంతో వృథాగా పోతున్న నీరు..


హజ్రత్ మహ్మద్ ఫీర్ బాబాన్ షా వలీ దర్గా, పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్

16 నుంచి ఉర్సు

● మూడు రోజులపాటు సింగూరు శివారులోని దర్గాలో ఉత్సవాలు
● హాజరుకానున్న అన్నసాగర్ పీఠాధిపతి ఖలీల్ హుస్సేన్

పుల్‌కల్, సెప్టెంబరు 11: మండలంలోని సింగూరు గ్రామ శివారులో వెలసిన హజ్రత్ మహ్మద్ ఫీర్ బాబాన్ షా వలీ దాదా హజత్ 79వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 16 నుంచి ప్రారంభంకానున్నాయి. 16, 17, 18వ తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత 79 సంవత్సరాలుగా ఏటా నిర్వహిస్తున్న ఉర్సుకు కుల, మతాలకతీతంగా వందలాది మంది ప్రజలు తరలివస్తుంటారు. ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా నిర్వాహకులు అన్నీ వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే దర్గాను రంగు రంగుల విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు. దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ ఇంటి నుంచి ఎంతో పవిత్రత కలిగిన గంధం, చాదర్‌ను దర్గాలోకి తీసుకువెళ్లే ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా 17వ తేదీన ఉదయం కబడ్డీ, వాలీబాల్‌తో పాటు వివిధ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం నాతే షై ఫీల్ సమ, అన్నదాన వితరణ కార్యక్రమాలు చేపడుతారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ హాజరుకానున్నారని దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లోన్ కట్టమని డబ్బులిస్తే.. స్వాహా..

● మహిళా గ్రూపు డబ్బులు కాజేసిన గ్రూప్ లీడర్ భర్త
● సభ్యులు నిలదీయడంతో దంపతుల మధ్య గొడవ
● లీడర్‌పై భర్త దాడి.. అడ్డుకుని చెట్టుకు కట్టేసిన సభ్యులు
● పరస్పరం పోలీసులకు ఫిర్యాదు.. కేసుల నమోదు
● బ్యాంకు ఎదుట మహిళా సంఘం సభ్యుల ఆందోళన

తూప్రాన్, సెప్టెంబరు 11: మహిళా సంఘం డబ్బులను ఆ గ్రూపు నాయకురాలి భర్త కాజేసిన ఘటన పడాలపల్లిలో చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం, గ్రామస్తుల కథనం ప్రకారం తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లిలోని అంబేద్కర్ మహిళా సంఘంలో సభ్యులు తూప్రాన్ ఎస్‌బీఐ బ్యాంకులో రూ.10 లక్షల రుణాలు తీసుకున్నారు. దీనికి సంబంధించిన నెలనెలా వాయిదాలు, పొదుపు డబ్బులను 11 నెలలుగా గ్రూపు నాయకురాలు కానుకుంట మున్ని మినీకి చెల్లిస్తున్నారు. ఈ డబ్బులను ఆమె భర్త బ్యాంకుకు చెల్లించకుండా సొంతానికి వాడుకుంటూ వస్తున్నాడు. దాంతో బ్యాంకు అధికారులు పొదుపు డబ్బుల నుంచి వడ్డీ డ్రా చేసి ఖాతాకు జమా చేయడం గుర్తించిన గ్రూపు సభ్యులు ఈ విషయమై మున్నిని కొద్దిరోజుల క్రితం నిలదీశారు. దీంతో ఈ నెల 10న మొత్తం డబ్బులు చెల్లిస్తానంటూ చెప్పిన ఆమె అప్పటి నుంచి కనిపించకుండా పోయింది. దీంతో మహిళలు మున్ని భర్త కానుకుంట భిక్షపతిని నిలదీశారు. కాగా, మంగళవారం రాత్రి మున్ని వచ్చిందని తెలుసుకున్న మహిళలందరూ ఆమె ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా.. డబ్బులు వాడుకున్న విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో భర్త మున్నిపై దాడికి యత్నించగా సంఘం సభ్యులు అడ్డుకుని భిక్షపతిని చెట్టుకు తాడుతో కట్టేశారు. మొత్తం రూ.6,62,610 కాజేసినట్లుగా గ్రూపు సభ్యులు గుర్తించి బుధవారం బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయం చేయాలని కోరుతూ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా చెట్టుకు కట్టేయడంపై లీడర్ భర్త భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. రుణాల వాయిదా చెల్లింపు డబ్బులు కాజేశారని మహిళా గ్రూపు సభ్యులు ఆయనపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భిక్షపతిపై, మహిళా గ్రూపు సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.


ఆందోళన చేస్తున్న గ్రూపు సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గట్లమల్యాల పాఠశాల విద్యార్థులు

నంగునూరు, సెప్టెంబరు 11 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నంగునూరు మండలం గట్లమల్యాల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం రమేశ్ తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న ఈశ్వరి, అను, వైష్ణవి, రోహిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌ను హెచ్ఎం అభినందించారు. ఎంపికైన విద్యార్థులను ఆప్ కమిటీ చైర్మన్ సరోజన, ఉపాధ్యాయులు అభినందించారు.

నారాయణరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థి..

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 11: జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నారాయణరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థి కమలాకర్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం వడ్డెపల్లి నాగరాజు బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యారిని పలువురు అభినందించారు.

ఖోఖో పోటీలకు రాయపోల్ విద్యార్థి..


సుశాంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయపోల్, సెప్టెంబరు 11: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుశాంత్ ఎంపికయ్యాడు. ఈ నెల 9న తూప్రాన్‌లో జరిగిన పోటీల్లో సుశాంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో పాల్గొంటాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సుశాంత్‌ను హెచ్ఎం నాగరాజు అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

అల్లాదుర్గం/చిన్నకోడూరు/తొగుట, సెప్టెంబరు 11: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశామని అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. అల్లాదుర్గం ఐబీ చౌరస్తా సమీపంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి కామారెడ్డి జిల్లా పిట్లంనకు ఓ బొలెరో వాహనంలో 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. దీంతో వాహనాన్ని సీజ్‌చేసి, నారాయణఖేడ్‌కు చెందిన డ్రైవర్ కదావత్ శ్రీనుపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పెద్దశంకరంపేటలోని పౌర సరఫరాల గోదాంలో నిల్వ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా నిల్వచేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఓ ఇంట్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశారనే నమ్మదగిన సమాచారంపై మంగళవారం సాయంత్రం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా వెళ్లి దాడి చేశారు. అక్రమంగా నిల్వచేసిన 10 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని నిల్వచేసిన అదే గ్రామానికి చెందిన ఉప్పలయ్య, కనకయ్య, బాలయ్యపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే తొగుట మండలం ఘనపూర్ గ్రామశివారులో మోపెడ్‌పై పల్లెపహాడ్ గ్రామానికి చెందిన గుగులోత్ రాజు అక్రమంగా తరలిస్తున్న క్వింటాల్ 20 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తొగుట రెవెన్యూ అధికారి అశోక్‌రాజ్ తెలిపారు.

నాసిరకం రేషన్‌బియ్యంపై విచారణ

అల్లాదుర్గం, సెప్టెంబరు 11: నాసిరకం బియ్యం మాకొద్దంటూ మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామస్థులు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ విషయమై పౌర సరఫరాల జిల్లా అధికారి సురేష్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ వినియోగదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొన్నది. పెద్దశంకరంపేటలోని పౌర సరఫరాల గోదాం ఇన్‌చార్జి తీరుతోనే దుమ్ము, ధూళి పట్టిన బియ్యం గ్రామాలకు సరఫరా అవుతున్నాయని డీఎస్‌వోకు విన్నవించారు. అలాగే ఈ విషయాన్ని జిల్లా అధికారులకు కూడా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

తుమ్మ గాలయ్య మృతి బాధాకరం

● మాజీ మంత్రి హరీశ్‌రావు


గాలయ్య(ఫైల్)

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 11: సిద్దిపేట చేనేత కురు వృద్ధుడు తుమ్మ గాలయ్య మృతి బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గాలయ్య మృతిపై సంతాపం వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న గొల్లభామ చీరలు అత్యధికంగా తయారు చేస్తున్న వ్యక్తిగా, మాస్టర్ వీవర్‌గా పేరు తెచ్చుకున్న వ్యక్తి గాలయ్య అని గుర్తుచేశారు. కనుమరుగైన పట్టు పీతంబరాన్ని ఈ ఆధునిక ప్రపంచానికి కూడా పరిచయం చేశారని, పట్టుపీతంబరాలు తయారు చేయడంలో దిట్ట అని, వీరి వద్ద ఎంతోమంది చేనేత వృత్తిని నేర్చుకున్నారని తెలిపారు. ప్రస్తుతం గాలయ్య దగ్గర 25 మంది చేనేత వృత్తి కళాకారులు ఉపాధి పొందుతున్నారన్నారు. భారతదేశంలో ఎక్కడ చేనేత ఎగ్జిబిషన్ జరిగినా సిద్దిపేట గాలయ్య స్టాల్ ఉంటుందని చెప్పారు. గొల్లభామలో పట్టుచీరలు టై అండ్ మస్సరైజ్డ్ చీరలు, పటోళ్ల చీరలు, పోచంపల్లి చీరలు తయారు చేయడంలో చాలా నైపుణ్యం కలవారని కొనియాడారు. ఆయన మృతి చేనేత కళారంగానికి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రజల్లో కాంగ్రెస్‌కు విశ్వసనీయత లేదు

● 1.2 లక్షల బీజేపీ సభ్యత్వాలే లక్ష్యంగా ముందుకు సాగాలి
● బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 11: ప్రజల్లో కాంగ్రెస్ సర్కార్ విశ్వసనీయతను కోల్పోయిందని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పండుగలా సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 1,20,000 సభ్యత్వ నమోదును లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. దేశవ్యాప్తంగా పకడ్బందీగా సభ్యత్వ నమోదు చేపట్టిన పార్టీ బీజేపీ అన్నారు. ప్రతీఒక్కరు బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారి వద్దకెళ్లి అడగాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. నవంబరు 10 వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో సభ్యత్వ నమోదు పూర్తిచేసుకుని జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే కార్యక్రమం మొదలవుతుందన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

కోహీర్, సెప్టెంబరు 11: ఇటీవల కోహీర్ మండలంలో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి పాడైన పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. కోహీర్‌లోని నారింజ పరీవాహక ప్రాంతంలో నీట మునిగి పాడైన మినుము, పెసర కంది తదితర పంటలను పరిశీలించామన్నారు. నారింజ పరీవాహక ప్రాంతంలో అధికంగా నల్లరేగడి భూమి ఉండడం వల్ల చాలామంది రైతులు చిరుధాన్యాల పంటలైన మినుము, పెసర, కంది సాగుచేసినట్లు తెలిపారు. భారీ వర్షాలతో నారింజ నిండుగా పారడంతో సమీప ప్రాంతంలో ఉన్న పంటలు నీట మునిగాయన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన పరిశీలించారు. ఫర్టిలైజర్ దుకాణదారులు నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు జరపాలన్నారు. అలాగే అన్ని రికార్డులను నమోదు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, ఏడీఏ ఉన్నారు.

కుల బహిష్కరణ ఘటనపై స్పందన

● కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో గ్రామస్థులకు అధికారుల కౌన్సెలింగ్


గ్రామస్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మనోహరాబాద్, సెప్టెంబరు 11: గ్రామంలో శుభ, అశుభ కార్యాలకు డప్పు కొట్టడం లేదని గౌతోజిగూడకు చెందిన పంచమి నరసమ్మ, ఈమె కుమారులు అర్జున్, చంద్రం కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయడంతో పాటు గ్రామస్థులు మాట్లాడితే జరిమానా విధిస్తామని తీర్మానించారు. దీంతో బాధితులు ట్విట్టర్‌లో మెదక్ ఎస్పీకి మంగళవారం ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు తూప్రాన్ సీఐ రంగకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుభాష్‌గౌడ్ బుధవారం గ్రామస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రంగకృష్ణ మాట్లాడుతూ కులంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి. కానీ ఇలా కుల బహిష్కరణ చేయొద్దన్నారు. గ్రామంలో మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా గ్రామస్థులు చూసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ కౌశిక, ఆర్ఐ దీక్షిత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమతబేగం, ఏఈవో నరేందర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం

- ఖేడ్‌లో ఎక్సైజ్ కార్యాలయానికి సొంత భవనం కరువు
- 8 ఏళ్ల క్రితం రూ.42 లక్షలు మంజూరైనా పూర్తికాని పనులు
- రెండు పాత ఇరుకు గదుల్లో 12 మంది సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం


ఖేడ్ శివార్లలోఅసంపూర్తిగా ఎక్సైజ్ కార్యాలయ భవనం పనులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 11: ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని సమకూర్చే ఎక్సైజ్‌శాఖకు సొంతభవనం కరువైంది. నూతన కార్యాలయం పనులు అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది శిథిలావస్థకు చేరిన పాత ఇరుకు గదుల్లో సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొన్నది.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఎక్సైజ్ కార్యాలయానికి సొంతభవనం లేకపోవడంతో ఎనిమిదేళ్ల క్రితం నారాయణఖేడ్ శివార్లలోని జూక్కల్ పరిధిలో సొంత భవన నిర్మాణానికి రూ.42 లక్షలు కేటాయించారు. అప్పట్లో పనులను పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించి, ప్రారంభించినప్పటికీ నత్తనడకన కొనసాగాయి. ఎనిమిదేళ్లుగా పనులు పూర్తి కాకపోగా, నిర్మాణ వ్యయం పెరిగింది. దీంతో గతంలో మంజూరు చేసిన నిధులు సరిపోవని కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు.

ప్రతి నెలా రూ.10 కోట్ల ఆదాయం..

నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో 13 మద్యం దుకాణాలు ఉండడంతో, ప్రతి నెల రూ.10 కోట్ల ఆదాయం వాటిద్వారా సమకూరుతుంది. ఇంత ఆదాయం సమకూరుతున్న, స్వంత భవనం నిర్మాణంపనులు ఎనిమిదేళ్లుగా నత్తనడకగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిర్మాణంలోఉన్న భవనం పనులు 80 శాతం పూర్తి కావచ్చినప్పటికీ, కాంట్రాక్టర్ ధరలు పెరగడంతో పనులను నిలిపి వేయడంతో, అసంపూర్తి దశలో ఆగి పోయాయి. ఇప్పటికైన అధికారులు స్పందించిపనులను సత్వరమే పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

80 శాతం పనులు పూర్తి

నిర్మాణ పనుల్లో జాప్యం విషయమై పోలీసు హౌసింగ్ శాఖ ఏఈ రాజయ్యను ఆంధ్రజ్యోతి సంప్రదించగా ఎనిమిదేళ్ల క్రితమే ఎక్సైజ్ కార్యాలయ భవన నిర్మాణానికి అప్పటి నిర్మాణ సామాగ్రి ధరల ప్రకారం రూ.42లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులు ఉన్న మేరకు కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసినా, ప్రస్తుతం అన్నిరకాల నిర్మాణ సామగ్రి ధరలు పెరుగడంతో కాంట్రాక్టర్ పనులు చేయక పోవడంతో ఆయనను తొలగించి కొత్త వారికి పనులు అప్పగించామన్నారు. ఇప్పటి వరకు 80 శాతంపనులు పూర్తి అయ్యాయని, మిగతాపనుల కోసం మరో రూ.16లక్షలు అవసరమనిప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు.

రెండు గదుల్లో 12 మంది సిబ్బంది

ప్రస్తుతం ఎక్సైజ్ కార్యాలయం నిజాంకాలంలో నిర్మించిన కిసాన్‌ఘర్‌లో కొనసాగుతున్నది. కేవలం రెండు గదుల్లోనే ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు, 12 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తున్నది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, సీజ్ చేసి సామగ్రిని కూడా భద్రంగా ఉంచడానికి సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.


కిసాన్‌ఘర్‌లో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: మెదక్ కలెక్టర్


పాపన్నపేట ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

పాపన్నపేట, సెప్టెంబరు 11: ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సమయ పాలన పాటించకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని మెదక్ కలెక్టర్ రాహుల్ హెచ్చరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో పాపన్నపేట ఆరోగ్య కేంద్రానికి సుస్తీ శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ బుధవారం పాపన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. ఇన్‌చార్జిగా వెళ్లిన ఆయూష్ డాక్టర్‌పై పనితీరుపై ఆరా తీశారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిపూర్ణ వికాసం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గణితం, ఫిజిక్స్ సైన్స్ తదితర సబ్జెక్టులో విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన టీచర్లు ఉంటారని చెప్పారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని విద్యార్థినులకు చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున టీచర్లు పారిశుధ్యంపై తగిన శ్రద్ధ వహించాలని కోరారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని టీచర్లకు సూచించారు. వంటశాలలో వంటలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్‌వో మమత, టీచర్లు ఉన్నారు. కాగా రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సీహెచ్‌ఐ చందర్‌కు సూచించారు. కలెక్టర్ పాపన్నపేట, పొడిచనపల్లి పీహెచ్‌సీలను సందర్శించారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి, వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రతీ పేషెంట్‌కు కేస్ షీట్ తెరవాలని సూచించారు. 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో సూచించారు. విధుల్లో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తప్పకుండా పర్యటించాలని ఆదేశించారు. వెంట శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుమ్మడిదల, సెప్టెంబరు 11 : గుమ్మడిదల మండలంలోని 33/11 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 12న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు బొంతపల్లి, గుమ్మడిదల, కనుకుంట సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మాసాయిపేట, సెప్టెంబరు 11: మాసాయిపేట మండలం రామంతపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎస్‌ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27 న రామంతాపూర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రామంతపూర్ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారుంటూ తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

కొర్వీపల్లి దుర్గామాత ఆలయంలో చోరీ

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 11: మండలంలోని కొర్వీపల్లిలో మంగళవారం రాత్రి దుర్గామాత ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి శివశక్తి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఎప్పటిలాగే ఆలయానికి వెళ్లేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయని తెలిపారు. లోనికి వెళ్లి పరిశీలించగా అమ్మవారి వెండి కిరీటం, ముక్కుపుడక, పలు ఆభరణాలతో పాటు హుండీలో ఉన్న కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెండి సుమారు కిలోన్నర ఉంటుందన్నారు. ఆలయంలోని సామగ్రిని చిందరవందరగా పడేసినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పూజారి తెలిపారు.

సంగారెడ్డిలో వ్యక్తి అదృశ్యం


జనార్దన్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 11: భార్యతో గొడవ పడిన ఓ ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగింది. పట్టణ సీఐ .భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన అవుటి జనార్దన్ (43) అనే వ్యక్తి సదాశివపేట సమీపంలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తూ సంగారెడ్డి పట్టణంలోని సాయికృషి నగర్‌లో అద్దె ఇంట్లో భార్య పిల్లలతో నివాసముంటున్నాడు. ఈ నెల 4వ తేదీన రాత్రి 7.30 గంటల సమయంలో జనార్దన్ తన భార్య లావణ్యతో గొడవ పడ్డాడు. ఈ నెల 5వ తేదీన తన మోటార్ సైకిల్ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతిచినా ఆచూకీ లభించలేదు. దీంతో లావణ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సిర్గాపూర్ తండాలో డీజే సీజ్.. కేసు నమోదు

కల్హేర్, సెప్టెంబరు 11: సిర్గాపూర్ తండాలో వినాయక నిమజ్జనంలో బుధవారం రాత్రి డీజే సౌండ్ పరికరాలు, వాహనాన్ని సీజ్ చేసి డిజె యజమానిపై కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకటొరెడ్డి తెలిపారు. నిమజ్జనంలో, వినాయక మండపాల వద్ద డీజే పెట్టవద్దని హెచ్చరించినా పట్టించుకోకుండా బుధవారం రాత్రి సిర్గాపూర్ తండాలో నిర్వహించే నిమజ్జనంలో డీజే పెట్టడంతో పట్టుకుని కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన డీజే యజమాని శ్రవణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటొరెడ్డి తెలిపారు.

ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ సిబ్బంది

మాసాయిపేట, సెప్టెంబరు 11: మండలంలోని అచ్చంపేట గ్రామంలో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకోవడంపై రెవెన్యూ అధికారులు బుధవారం ఆక్రమణలను యంత్రాలతో తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. అచ్చంపేటలోని సర్వేనెంబర్ 142లో గత ఏడాది కాలంగా నివాసాలు ఏర్పాటు చేసుకొని నివాసముంటున్న కొందరు కాలనీవాసులకు రెవెన్యూ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసి హెచ్చరించారు. అయినా ఆక్రమణదారులు స్పందించకపోవడంతో బుధవారం రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కట్టడాలను కూల్చివేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: డీఆర్డీవో పీడీ

చేగుంట, సెప్టెంబరు 11: మహిళాశక్తి ద్వారా రుణాలు పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వీవోల రివ్యూ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రుణాలు పొందిన ప్రతీ మహిళ సభ్యురాలు వివిధ వ్యాపారాల్లో రాణించి ఆర్థికంగా ముందుకు సాగాలన్నారు. చిరు వ్యాపారాలతో పాటు పాడి పరిశ్రమ కోళ్ల పరిశ్రమ మినీ ఇండస్ట్రియల్, అధునాతన వ్యవసాయ పద్ధతిలో పండ్ల తోటలు, పూల తోటలు సాగు చేస్తే లాభాలు గడించే అవకాశం ఉందన్నారు. అనంతరం జేత్రరాం తండాలో నాటు కోళ్లఫామ్‌ను పరిశీలించారు.

● మాసాయిపేట: మహిళలను చైతన్యవంతం చేసి మొక్కల నాటడానికి కార్యాచరణ చేపట్టినట్లు డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని పోతనశెట్టిపల్లి గ్రామంలో మహిళా సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లక్ష్యం 30 వేల మొక్కలను మహిళలతో నాటించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం గొల్లపల్లిలో కోడి పిల్లల పెంపకం పై అవగాహన కల్పించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రేగోడు సెప్టెంబరు 11: పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు. బుధవారం రేగోడులో ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పదవతరగతి లోపు చదువును మధ్యలో ఆపేసినవారు ఓపెన్ లో 10వ తరగతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 30వరకు దరకాస్తు చేసుకోవడానికి ఆఖరిగడువు అని తెలిపారు. రేగోడు ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లను తీసుకుంటున్నామని ఓపెన్ స్కూల్‌లో చేరేవారు 9493817535 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రేగోడు సెప్టెంబరు 11: పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి పేర్కొన్నారు. బుధవారం రేగోడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో పాటు పౌష్టికారం ఇవ్వాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న బాలామృతంతో పలు రకాల వంటకాలు చేసుకోవచ్చని అవగాహన కల్పించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

నిజాంపేట, సెప్టెంబరు 11: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడే దిశగా మహిళా గ్రూపు సభ్యులు పనిచేయాలని సీసీ స్వరూప పేర్కొన్నారు. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో బుధవారం రోజున మహిళా సంఘాల ఆధ్వర్యంలో వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా సంఘానికి ఈ సంవత్సరం నాటికి రూ.16.50 లక్షల లాభం సమకూరిందన్నారు. మహిళా గ్రూపుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే లాభాలు పొందవచ్చని తెలిపారు. అలాగే ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటి రాఖీ కట్టాలన్నారు. ముందుగా మొక్కలు రావి, చింత, మర్రి, వేప లాంటి జీవితకాలం మొక్కలను 165 మంది మహిళా సభ్యులకు అందజేశారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం: ఎస్‌ఎఫ్‌వో


బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, సెప్టెంబరు 11: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్‌ఎఫ్‌వో విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు బుధవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌వో విజయలక్ష్మి, జీసీడీవో సుకన్య, ఎంఈవో యాదగిరి, పాఠశాల ఎస్‌వో ఫాతిమా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


సిరిపురం పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న దృశ్యం

హత్నూర, సెప్టెంబరు 11: మండలంలోని సిరిపుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు రావడంతో బుధవారం స్థానికులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు నర్సింహులు, గణితం బోధించే ఉపాధ్యాయురాలు గీతారాణిలను స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ నరేందర్, గ్రామ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజులతో పాటు ఉపాధ్యాయుల బృందం ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది: ఎంపీడీవో


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 11: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎంపీడీవో దామోదర్, ఎంఈవో బుచ్చయ్య నాయక్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలకేంద్రంలో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పలు గ్రామాలకు చెందిన పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ముందుగా సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, హెచ్‌ఎంలు, దీప్లా రాథోడ్, సాయిరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రేగోడు సెప్టెంబరు 11: మండలంలోని సిందోల్ గ్రామానికి చెందిన మంగలి విఠల్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన ముఖీం పాటిల్ ద్వారా తెలుసుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష బాధిత కుటుంబానికి రూ 11 వేలు నగదును బుధవారం అందజేశారు.

మెదక్‌లో వైద్యకళాశాల అనుమతిపై సంబురాలు


సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నాయకులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 11: మెదక్ జిల్లావాసుల దశాబ్దాల కల ఎట్టకేలకు సాకరం కానుంది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కౌన్సిల్) గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ.. మెదక్ జిల్లావాసులకు తీపి కబురు అందించింది. జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తూ ఎన్ఎంసీ అనుమతులు జారీ చేయడంతో స్థానిక మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులో సంబరాలు జరుపుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. సంబురాల్లో కౌన్సిలర్లు లింగం, శేఖర్, సమివొద్దిన్, లక్ష్మీనారాయణగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజొద్దిన్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మెదక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

జిల్లాకు ఒక మెడికల్ కళాశాల మోదీ కల: బీజేపీ

మెదక్ అర్బన్, సెప్టెంబరు 11: జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ప్రధాని మోదీ కల అని, అందులో భాగమే మెదక్ వైద్య కళాశాల ఏర్పాటు అని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బస్ డిపో వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి కోసం కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావు, ప్రధాని మోదీ, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. మెదక్ జిల్లాలో మెడికల్ కళాశాల విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా.. మంత్రి జేపీ నడ్డాతో చర్చించి ఎన్ఎంసీ అనుమతి వచ్చేలా కృషి చేశారన్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి మహేశ్వరి, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా: మెదక్ ఎమ్మెల్యే


రామాయంపేట: కోనాపూర్‌లో కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

రామాయంపేట, సెప్టెంబరు 11: గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రామాయంపేట మండల పరిధి కోనాపూర్, ప్రగతి ధర్మారం గ్రామాల్లో ఎమ్మెల్యే ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. అంతకు ముందు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై తాను అన్ని గ్రామాల పురోభివృద్ధే లక్ష్యంగా శ్రమిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావ్, జిల్లా నాయకులు పల్లె రామచందర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 11: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన దొంతి భూదయ్య, కుమారుడు మల్లేష్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనతో బుధవారం ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అలాగే వెంకట్రావుపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఇరు కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంకరణలతో ఆకట్టుకుంటున్న గణనాథులు


రామచంద్రాపురం: ఇంద్రానగర్ కొమురం భీం కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఎంపీ మల్లు రవి


రామచంద్రాపురం: ఎంఐజీ వినాయక మండపంలో 111వ డివిజన్ కార్పొరేటర్ వి.సింధూరెడ్డి పూజలు

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్/కల్హేర్/రాంచంద్రాపురం, సెప్టెంబరు 11: వినాయక నవరాత్రుల నేపథ్యంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మండపాల అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ రూపాల్లో కొలువు దీరి పూజలందుకుంటున్న గణనాథులను దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరుతున్నారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టడంతో ఎటు చూసినా ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. బుధవారం మెదక్ పట్టణంలోని వక్రతుండ గణేష్ మండలి వద్ద నిర్వహించిన అన్న ప్రసాదవితరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, పలువురు కౌన్సిలర్లు పాల్గొని పూజలు చేశారు. వాసవీనగర్, వీరహనుమాన్ కాలనీ పంచముఖి గణేష్ మండపాల వద్ద కూడా హోమం, గరక పూజలు చేశారు. నర్సాపూర్‌లోని ధర్మశాలలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేకంగా పూజలు, కుంకుమార్చన చేశారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్‌లో బాలల గణేష్ మండలివారి మండపంలో చిన్నారుల పూజలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ కొమురం భీం కాలనీలో 'పర్యావరణ గణపతి' ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నాగర కర్నూల్ ఎంపీ మల్లు రవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజుకోటి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సీపీ రెడ్డి, ఉత్సవకమిటీ సభ్యులు కోటి రవి, శ్రీనివాస్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.


మెదక్‌లో గరక పూజలందుకుంటున్న వాసవీ, వీరహనుమాన్ కాలనీ గణనాథుడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ సురేష్ పవార్, డీఈ ఇంతియాజ్ అహ్మద్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 11 : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ క;;ఇషనర్ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి- నీలి ఆకాశం దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ఇళ్లవద్ద ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. స్వచ్ఛమైన గాలిని పీల్చడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఇంతియాజ్ అహ్మద్, కాలుష్య నియంత్రణ మండలి కన్సల్టెంట్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా లక్ష్యాన్ని పూర్తి చేయాలి

నర్సాపూర్, సెప్టెంబరు 11: గ్రామ సంఘ సహాయకులు ప్రణాళికబద్ధంగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేయాలని జిల్లా డీఆర్డీఏ అదనపు పీడీ సరస్వతి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ ఐకేపీ కార్యాలయంలో గ్రామసంఘ సహాయకుల సమీక్ష సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామం మహిళాశక్తి కార్యక్రమంలో వందశాతం ప్రగతిని సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గౌరీశంకర్, ఎస్‌బీఐ మేనేజర్ సునీల్‌గాంధీ, ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ ఎదుట రెండో రోజు కార్మికుల బైఠాయింపు


కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్

హత్నూర, సెప్టెంబరు 11: మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులో గల ఎపిటోరియా యూనిట్-1 పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. బుధవారం ఉదయం 6గంటలకే పరిశ్రమ వద్దకు చేరుకొని బైఠాయించి ఆందోళన చేపట్టారు. పరిశ్రమ ఎదుట టెంటు వేసేందుకు కార్మికులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎండలోనే కూర్చొని గొడుగులు పట్టుకున్నారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా అక్కడికి చేరుకొని కార్మికులతో పాటు కూర్చున్నారు. ఎండ వేడిమిని భరించలేని కార్మికులు లేచి పరిశ్రమ ప్రధాన గేటు వద్ద ఎస్‌ఐ అనుమతితో టెంట్ వేసుకుని బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుభాష్ జోక్యం చేసుకొని పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరిపిస్తామని చెప్పడంతో బీజేపీ రాష్ట్ర వర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్‌తో పాటు పలువురు పరిశ్రమ కార్మికులు పరిశ్రమలకు వెళ్లి చర్చలు జరిపారు. చర్చలు సఫలం కాకపోవడంతో తిరిగి ఆందోళన కొనసాగించారు.

క్రీడలతోనే శారీరక దృఢత్వం: జిల్లా విద్యాధికారి

హవేళిఘణపూర్, సెప్టెంబరు11: విద్యార్థులకు క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం కల్గుతుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ విషయంలో తమపిల్లలను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించినప్పుడే క్రీడాకారులుగా రాణిస్తారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధుమోహన్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.